క్లుప్తంగా

విజ్ఞానాన్ని పెంచుకోండి



వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో గ్రంథాలయ అధికారి

బేతంచెర్ల: విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయాలను సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథాలయ అధికారి మధు శేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం లో గ్రంథాలయాల అవశ్యకతను ఆయన వివరించారు. విద్యార్థులకు అవసరమైన కాంపిటిషన్ ఎగ్జామ్స్ పుస్తకాలతోపాటు, నీతికథల పుస్తకాలూ అందుబాటులో ఉన్నాయన్నారు.

21 ఉచిత మెగా వైద్య శిబిరం

డోన్ టౌన్: స్థానిక బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 21న(ఆదివారం) ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్వభారతి మెడికల్ కళాశాల, జనరల్ హాస్పిటల్ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండె జబ్బులు, న్యూరాలజీ, ఎముకలు, జనరల్ సర్జరీ, కంటి తదితర అన్ని జబ్బులకు పరీక్షలు నిర్వహించి ఉతితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బోర్లకు మరమ్మతులు



బోరుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ కళ్యాణి

డోన్: మండల పరిధిలోని కన్నపకుంట గ్రామంలో పనిచేయని బోర్లకు సర్పంచ్ కళ్యాణి మరమ్మతులు చేయించారు. గ్రామంలో ఏ విధంగా నీటి సమస్య తలెత్తకుండా మర్మతులకు గురైన బోర్లకు రిపేరీ చేయిస్తున్నామని ఈ సందర్భంగా సర్పంచ్ తెలిపారు.

మజ్జిగ పంపిణీ

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాల ఆవరణంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి నేపథ్యంలో తమవంతుగా బాటసారులకు మజ్జిగ అందజేస్తున్నామని వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సూర్య బల్లాని, గుప్త తెలిపారు.

వృద్ధాశ్రమంలో మాతృ దినోత్సవం



ఆశ్రమంలోని వృద్ధులను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: స్థానిక వైయస్ నగర్‌లోని వృద్ధాశ్రమంలో ఆదివారం మాతృదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వృద్ధును శాలువతో సత్కరించి కేక్ కట్ చేయించి పంచిపెట్టారు. అమ్మలేకుంటే జన్మే లేదని, ప్రతిఒక్కరూ అమ్మను గౌరవించాలని ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ పిలుపునిచ్చారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

సంజామల: వేసవి సెలవుల నేపథ్యంలో స్థానిక గ్రంథాలయ శాఖలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ బాలతిమ్మారెడ్డి తెలిపారు. సమ్మర్ క్యాంప్ విజ్ఞాన శిబిరం వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. సమ్మర్ క్యాంప్ జూన్ 11 వరకు ఉంటుందని ఆయన తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం

డోన్ : పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో 75 ఏళ్లు పూర్తి చేసుకున్న రిటైర్డు హెచ్‌ఎం సుబ్బరాయుడిని ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక పెన్షనర్ల సంక్షేమ సంఘం కార్యాయలంలో సుబ్బరాయుడికి పెన్షనర్లు శాలువా కప్పి పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, సభ్యులు దాసప్ప, రామదాసురెడ్డి, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, నేత్రానంద, సదానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొలం రస్తా విషయంలో ఘర్షణ

డోన్ టౌన్: మండల పరిదిలోని సీసంగుంతల గ్రామంలో పొలం రస్తా విషయంలో ఆదివారం ఘర్షణ జరిగింది. జమీల్ మియా అనే వ్యక్తికి గాయాలు అయినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. దాయాదులు అయిన లడ్డు సాబ్, షేక్షావలి, అల్లావలి అనే వ్యక్తులకు బాధితుడు జమీల్ మియా మధ్య రస్తా విషయంలో ఉదయం ఘర్షణ పడ్డారు. కర్రలతో దాడి చేయగా గాయాలు అయ్యినట్లు పోలీసులు తెలిపారు. చికిత్సల నిమ్మిత్తం జమీల్ మియాను బంధువులు కర్నూలుకు తరలించినట్లు తెలిపారు.

తల్లీబిడ్డ 'ఆరోగ్యం' పదిలం!

- మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు
- హైరిస్క్ గర్భిణులపై వైద్యుల ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వాసుపత్రుల్లో పెరుగుతున్న ప్రసవాలు



బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల వార్డు

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతోపాటు గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. అదేవిధంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రవేశపెట్టి ప్రజల వద్దకే వైద్యవ సేవలు అందజేస్తుంది. ఈ నేపథ్యంలో మాతా శిశు సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది ప్రభుత్వం. తల్లీబిడ్డా ఆరోగ్యం పదిలంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వైద్య, ఆరోగ్య, స్త్రీ,శిశు సంక్షేమశాఖ అధికారులు, సిబ్బంది గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రణాలికతో ముందుకు సాగుతున్నారు. గర్భిణీ మూడో నెల నుంచి సుఖప్రసవం అయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు వైద్యులు. గర్భిణీకులకు ప్రారంభం నుంచి రెగ్యూలర్‌గా వైద్యపరీక్షలు చేయడంతో పాటు హైరిస్కు ఉన్న వారిని గుర్తించి హెల్త్ సూపర్ వైజర్ నేతృత్వంలో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. గర్భిణి ప్రసవానికి పుట్టింటికి వెళ్లినా అక్కడ వైద్య బృందాలతో చర్చించి సుఖప్రసవం జరిగేల చూస్తున్నారు. ఐరన్ మందులను వాడుతున్ననూ రక్తహీనత ఉన్నవారిని గుర్తించి ఐరన్ ఇన్‌జెక్షన్లు ఇస్తున్నారు. గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్ సమస్యలు, రక్తహీనతతో బాధపడుతునా... గతంలో అబార్షన్, గుండెజబ్బులు ఉన్నవారిని హైరిస్కు కేసులుగా గుర్తిస్తారు. ఇలాంటి గర్భిణులను ఆశా, ఏఎన్‌ఎంలతో పాటు పబ్లిక్‌హెల్త్ నర్సు, సూపర్ వైజర్లు పర్యవేక్షింస్తుంటారు. ఇలా వైద్య ఆరోగ్యశాఖ క్షేత్ర స్థాయి నుంచి సమిష్టికృషితో సుఖప్రసవాలు అయ్యేలా చూస్తున్నారు. దీంతో ఏటేటా ప్రభుత్వాసుత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతుంది.

ఫ్యామిలి ఫిజీషియన్ వరం

ఒకప్పుడు గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలంటే దూరప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాల్సివచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలి ఫిజీషియన్ కాన్సెప్ట్ గర్భిణీలకు వరంగా మారింది. ఇంటి సమీపంలోని వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో పరీక్షలు చేసి నెలకు సరిపడ మందులు ఇస్తున్నారు. దీంతో గర్భిణీలు, బాలింతలు, పసిపిల్లల ఆరోగ్య సంరక్షణకు ఫ్యామిలి ఫిజీషియన్ ఎంతో ఉపయోగపడుతుంది. హీమోగ్లోబిన్ 8 గ్రాముల శాతం కంటే తగ్గిన వారికి ఐరన్ ఇన్‌జెక్షన్ ఒక కోర్సు ఇవ్వడం జరుగుతునది. గర్భిణి 8–9 నెలల సమయంలో హీమోగ్లోబిన్ తగ్గినవారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన హీమోగ్లోబిన్ ఇన్‌జెక్షన్స్ ఎంతో ప్రయోజకరంగా ఉంటున్నట్లు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

బాలింతలకు ఆర్థిక సాయం

ఆసుపత్రిలో కాన్పు జరిగిన మహిళకు ఆరోగ్య శ్రీ పథకం కింద రూ.4వేలు, జననీ సురక్షిత యోజన కింద రూ.1000 అందజేస్తుంది ప్రభుత్వం. కాన్పు అయిన నాటి నుంచి ఉదయం టిఫెన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం పాలు, బెడ్లు, రాత్రి భోజన వసతి కల్పిస్తున్నారు. అలాగే కాన్పులు అయిన బాలింతలను తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా నేరుగా వారి గ్రామంలోని ఇంటి వద్దకు చేర్చుతున్నారు. దీంతో బాలింతలకు ఇబ్బందులు లేకుండా సురక్షితంగా చేర్చుతున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సేవల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పక్కా ప్రణాళికతో ముందుకు



మాత శిశుమరణాలను పూర్తిగా నివారించే లక్ష్యంతో పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. గర్భిణి మూడో నెల నుంచే రెగ్యూలర్‌గా పరీక్షలు చేయిస్తున్నాం. హైరిస్కు ఉన్నవారిని గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నాం. నెలలు నిండకుండా పుట్టిన పసిపిల్లలకు అవసరమైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చాం. – **శివశంకరుడు, వైద్యాధికారి పీహెచ్‌సీ టంగుటూరు**

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

నేడు రక్తదాన శిబిరం

డోన్ టౌన్ : దివంగత నడిమింటి నందీష్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఉదయం స్థానిక బాలికల ఉన్నత పాఠశాల్లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు మిత్రులు, కుటుంబ సభ్యులు తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రి, పాత బస్టాండ్, గుత్తి రోడ్డులోని రైల్వే స్టేషన్ అమ్మ హోటల్ వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్యాపిలి: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గోకుల్ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన అభివృద్ధికి సంబంధించిన ప్రగతి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశానికి హాజరై తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలన్నారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైతే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుదాఘాతానికి రెండు గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

కొలిమిగుండ్ల/అవుకు: కొలిమిగుండ్ల మండలం బెలుం శింగవరానికి చెందిన మార్కె రఘురాముడికి చెందిన రెండు గేదెలు ఆదివారం విద్యుధాఘాతంతో మృత్యువాత పడ్డాయి. వివరాలిలా ఉన్నాయి. మార్కె రఘురాముడు తన నాలుగు గేదేలను రోజు మాదిరిగానే మేపేందుకు వెళ్లాడు. అవుకు మండలం చనుగొండ్ల పొలాల సమీపంలో అప్పటికే విద్యుత్ స్తంభం కింద పడి ఉండేది. అయితే విద్యుత్ సరఫరా జరుగుతుండేది. ఈ నేపథ్యంలో గేదేలు మేత మేసుకుంటు తీగలను తాకడంతో అక్కడిక్కడే రెండు గేదేలు మృతి చెందాయి. మృతి చెందిన వాటి విలువ రూ.50 వేలకు పైగానే ఉంటుందని బాధితుడు వాపోయాడు.

సంతాపం



మృతదేహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె: అవుకు రిజర్వాయర్‌లో ఆదివారం జరిగిన బోటుప్రమాదంలో మృతి చెందిన నూర్జహాన్, హషియా మృతి పట్ల ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. శవపరీక్ష నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉన్న మృతదేహాలను ఆయన పరిశీలించి విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబసభ్యులకు ఎలాంటి సహాయ సహకారాలు అందజేస్తామని, ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా తనతండ్రి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదుకుంటారని తెలిపారు.

నేడు కలెక్టరేట్ ముట్టడి

డోన్ టౌన్: భవన నిర్మాణ రంగ కార్మికుల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా సోమవారం చేపట్టనున్న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని సంఘం అధ్యక్షుడు పుల్లయ్య పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం కలెక్టరేట్ ముట్టడిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమానికి కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు అబ్బాస్, నాయకులు ప్రసాద్, కుమార్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు అధికారులు హాజరు కావాలి

బేతంచెర్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి మండల కేంద్రం బేతంచెర్లలో సోమవారం నిర్వహించే స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి ఆదివారం తెలిపారు. అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: పట్టణంలోని రైల్వే గేటు నుంచి డోన్ రహదారి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. డోన్ రహదారిలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట నిలిపివేస్తున్నామని, ప్రజలు, పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.

మిక్చర్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

డోన్ టౌన్ : పట్టణంలోని శ్రీకృష్ణ లాడ్జి వెనుకాల మిక్చర్ (కార,బూంది)తయారు చేసే ఫ్యాక్టరీలో ఆదివారం అగ్ని ప్రమాదం జరిగింది. రూ.4లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. రాత్రి పెద్ద మస్తాన్ అనే వ్యాపారస్తునికి సంబంధించిన ఫ్యాక్టరీలో ఒక్క సారిగి మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. దాదాపు మూడు గంటల కష్టపడి మంటలను అదుపులోకి తీసుక వచ్చారు. ఈ ప్రమాదంలో శనిగ బేడలు, శనిగ పిండి, వంట నూనెతో పాటు మిక్చర్ తయారు చేసే మిషన్లు కాలిపోయాయి. వీటి విలువ దాదాపు రు.4లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు. అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూటా లేక ఏదైన ఇతర కారణాలా అనే విషయం తెలియాల్సి ఉందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

శ్రీ మద్దిలేటి స్వామి ఆలయంలో చురుగ్గా రహదారి పనులు



ఆలయ ఆవరణలో జరుగుతున్న రోడ్డు పనులు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో బైపాస్ రోడ్డు నుంచి స్వామి ఆలయం వరకు 1250 మీటర్లతో 20 అడుగుల సీసీ రోడ్డు నిర్మాణానికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.1.98 కోట్లు డీఎంఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు చేపట్టిన రహదారి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆలయం పైభాగాన సీసీ రహదారి పనులతో పాటు బ్రిడ్జి పనులు పూర్తికాగా, ఆలయం కింది భాగం నుంచి ప్రస్తుతం రహదారి ప్రారంభించారు. ఈ రహదారి పనులు పూర్తయితే స్వామివారి భక్తులకు సౌకర్యంగా మారనుంది.

మహానందిలో భక్తుల రద్దీ



మహానంది ఆలయ ప్రాంగణంలో భక్తులరద్దీ

మహానంది: వేసవిసెలవులు, ఆదివారం, పెళ్లిళ్లు ఉండటంతో మహానంది ఆలయం భక్తజనంతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరవడంతో క్షేత్ర పరిసరాలు సందడిగా కనిపించాయి. ఉదయం అష్టవిధ మహామంగళ హారతుల సమయం నుంచి ప్రారంభమైన శ్రీ కామేశ్వరీ, మహానందీశ్వరస్వామి వార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

కోనేరుల్లో యువకుల అల్లరి

నంద్యాలకు చెందిన కొందరు యువకులు మహనంది కోనేరులో స్నానం చేస్తూ అల్లరి చేస్తున్న విషయాన్ని గమనించిన ఉద్యోగి నాగరాజు, మరికొందరు అల్లరి చేయొద్దంటూ సూచించేందుకు వెళ్లగా వాగ్వాదానికి దిగి దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు, స్థానికులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆల య దక్షిణమాడ వీధిలోని నిత్యకళావేదికపై కువైట్‌కు చెందిన అనన్య సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. మహాగణపతిం, శివశంకర, నమఃశివాయ తే, భో..శంభో, తదితర గీతాలకు నృత్యం చేశారు.

కొలనుభారతిలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: సరస్వతీ క్షేత్రమైన కొలనుభారతిలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పురోహితులు భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కలిగించి, విశేష పూజాకార్యక్రమాలు చేపట్టారు. సుమా రు 24 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు.


హోరాహోరీగా క్రికెట్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నంద్యాల జిల్లా సహకార సంఘం ఉద్యోగుల యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీల్లో వెలుగోడు, ఆత్మకూరు, శిరివెళ్ల, కోవెలకుంట్ల, నంద్యాల, ఆళ్లగడ్డ సొసైటీల జట్లు పాల్గొన్నారు. విజేతగా నంద్యాల టీం గెలుపొంది రూ.15వేలు దక్కించుకుంది. రన్నరప్‌గా వెలుగోడు టీం రూ.10వేలు దక్కించుకోగా మూడో స్థానంలో కోవెలకుంట్ల సొసైటీ టీం నిలిచి రూ.5వేలు అందుకుంది. మేనేజర్‌లు మధుబాబు, నారాయణరెడ్డి, అమర్‌నాథరెడ్డి బహుమతులు అందజేశారు.

మట్టి కుండలకు ఏదీ ఆదరణ?



తయారైన మట్టిపాత్రలు ఫైల్



కుమ్మరి చక్రంపై మట్టిపాత్రలను తయారుచేస్తున్న దృశ్యం(ఫైల్)

బేతంచెర్ల : మట్టి కుండలకు ఒకప్పుడు ఎనలేని ఆదరణ ఉండేది. మట్టితో తయారు చేసిన పాత్రలు, కడవలు తాగునీటి పెద్దబానలు ప్రతి ఇంటిలో ఉండేవి. దీంతో కుమ్మరి కులస్తుల జీవనం సుఖంగా కొనసాగేది. ఆ రోజుల్లో మట్టిపాత్రలను వివిధ ఆకారాల్లో తయారుచేసి సమీప పట్టణాలకు, సంత రోజుల్లో వారు విక్రయాలు జరిపి జీవనం గడిపేవారు. జాతర ఉత్సవాల్లో అమ్మవారి ఉత్సవ మూర్తులను తయారుచేయడంలో వారిదే కీలక పాత్ర. అంతేకాకుండా ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించుకునే వినాయక చవితి ఉత్సవాలకు రంగు రంగుల విగ్రహాలను తయారు చేసి అమ్మకాలు కొనసాగిస్తుంటారు. ఆ రోజుల్లో పక్క మండలాలైన ఓర్వకల్లు, వెల్దుర్తి, డోన్ తదితర మండలాలకు ఎడ్ల బండ్లపై కుండలను, మట్టి కడవలను తీసుకెళ్లి గ్రామాల్లో విక్రయించి కొర్రలు, జొన్నలు, కందులు తీసుకొని కుండలను ఇచ్చేవారు. మండల పరిధిలోని రంగాపురం, సంకలాపురం, ఎంబాయి, బేతంచెర్ల, సిమెంట్‌నగర్ గ్రామాల్లో దాదాపు 400 కుటుంబాలు ఉండగా అందులో 150 కుటుంబాలు ఈ వృత్తిని స్వీకరించి జీవనం గడిపేవారు. మిగతా వారంతా వ్యవసాయ పనులు, కూలీ పనుల్లో పాల్గొనేవారు. పెరిగిన ఆధునిక టెక్నాలజీ దృష్ట్యా వాటి స్థానంలో స్టీల్‌పాత్రలు, రాగి, కంచు పాత్రలు, ప్లాస్టిక్ బిందెలు రావడంతో వీటికి ఆదరణ కరువైంది. నాడు 150 కుటుంబాలు కులవృత్తిని చేపట్టగా నేడు 30 కుటుంబాలు మాత్రమే ఈ వృత్తిని కొనసాగిస్తున్నాయి.

అవుకు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



అవుకు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి..

అవుకు: మండల కేంద్రం అవుకుపోలీస్ స్టేషన్‌ను నంద్యాల జిల్లా ఎస్పీ ఆదివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలోని కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. స్టేషన్‌లో సిబ్బంది ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజలతో మమేకమై ఉండాలన్నారు. అలాగే స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి, బనగానపల్లె ఇంచార్జ్, బేతంచెర్ల సీఐ ప్రీతమ్ రెడ్డి, అవుకు ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



బేతంచెర్ల లో ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



భక్తులకు భోజనం వడ్డిస్తున్న కాటసాని ప్రసాదరెడ్డి

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని పాటి ఆంజనేయస్వామి, గాంధీసెంటర్, ఎస్సార్బీసీ తదితర ప్రాంతాలతోపాటు గ్రామాల్లో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. స్వామివారికి అభిషేకం, అర్చన, తదితర కార్యక్రమాలు చేపట్టారు.

బేతంచెర్ల: మండల కేంద్రం బేతంచెర్లతోపాటు గ్రామాల్లో ఆదివారం హనమాన్ జయంతి విడుకలు ఘనంగా జరిగాయి. సీతారామాపురం గ్రామ సమీపాన కొండపైన వెలసిన ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో భక్తుల దర్శనమిచ్చారు. సిమెంట్ నగర్ గ్రామంలో ఉప సర్పంచ్ అప్పా మమత, గ్రామ వైఎస్సార్ నాయకులు సత్యం ఆధ్వర్యంలో జరిగిన అభయాంజనేయస్వామి పూజకు పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ జీఎం రాఘవరెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, రామనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

బనగానపల్లెరూరల్: మండల కేంద్రం బనగానపల్లెతోపాటు గ్రామాల్లో ఆదివారం శ్రీ హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆంజనేయస్వామికి ఆకుపూజ, అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పలుకూరులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి స్వామివారికి పూజలు చేశారు. పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని సులోచన దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నూకల విజయకుమార్, నల్లగట్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు వెంకటసుబ్బయ్య, మద్దిలేటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: పట్టణంలోని కొండపేటలో వెలసిన శ్రీపెద్దాంజనేయదేవస్థానంలో టీటీడీ, హిందూ ధర్మ పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహ కులు మల్లు వెంకటరెడ్డితో పాటు ధార్మిక సంస్థల ప్రతినిధులు హనుమాన్ జయంతి ప్రాముఖ్యతను వివరించారు. సాయంత్రం పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంట నిర్వహించిన హనుమంతుడి శోభాయాత్ర అంరంగవైభవంగా సాగింది. కార్యక్రమంలో ధర్మ ప్రచార కమిటీ సభ్యులు డాక్టర్ గథశెట్టిరవికుమార్, డాక్టర్‌బోలుగద్దె అనిల్‌కుమార్, నాగమల్లారెడ్డి, జక్కా నాగరాజు, దొంతా వెంకటేశ్వర్లు, ఓబులరెడ్డి, బింగి మళ్ల హనుమాన్, డి.వెంకటసుబ్బయ్య, కృష్ణారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, శివకృష్ణయాదవ్, కిశోర్‌కుమార్, బచ్చుశరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అవుకు: మండల కేంద్రం అవుకుతోపాటు గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గుండ్ల శింగవరం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాటసాని ప్రసాద్ రెడ్డి, ఆయన సతీమణి సులోచనలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే నిచ్చెనమెట్ల గ్రామంలో ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, నాయకులు చెన్నప్ప, భాస్కర్ రెడ్డి, చెన్నయ్య ఆధ్వర్యంలో కోళ్లాటాల మధ్య ఆంజనేయ స్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు.


డోన్ టౌన్ : హనుమాన్ జయంతి పురష్కరించుకోని పట్టణంలో ఆదివారం సాయిత్రం ఆంజనేయ స్వామి చిత్ర పటాలకు, ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కొలువైన ఏకశిలా విగ్రహ ఆంజనేయ స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొలిమిగుండ్ల: హనుమాన్ జయంతి వేడుకలు ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మీర్జాపురం సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిపారు. జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డితో పాటు పలువురు నాయకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహేశ్వరరెడ్డి జెడ్పీచైర్మన్‌తో పాటు పలువురిని సన్మానించారు.



ప్రత్యేక అలంకరణలో ఇందిరానగర్ అభయాంజనేయ స్వామి

డోన్ టౌన్ : మండల కేంద్రం డోన్‌తో పాటు గ్రామాల్లో ఆదివారం హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానిక ఇందిరానగర్‌లోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో అర్చకులు విజ య్ శర్మ,లక్ష్మినారాయణ శర్మ ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గుమ్మకొండ గ్రామ సమీపంలో వెలసిన బంగారుకొండ పాత మల్లయ్య ఆంజనేయ స్వామి ఆలయంలోని మూల విరాట్‌కు అభిషేకం, అర్చన, ఆకుపూజలు నిర్వహించారు. వెంకటాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు పంచలోహం తొడుగుతో ఆకుపూజ, మంగళ హారతులు, సాయిత్రం గ్రామోత్సవం నిర్వహించారు.



పాతమల్లయ్య ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు